క్లుప్తంగా

నాణ్యమైన విత్తన వేరుశనగ అందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అంజినప్ప

గాండ్లపెంట: మండల రైతాంగానికి ఖరీఫ్‌లో నాణ్యమైన విత్తన వేరుశనగ అందించాలని ఎంపీడీఓ అంజినప్ప సూచించారు. గురువారం మండల పరిధిలోని మలమీదపల్లి గ్రామ సచివాయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సుస్థిరాభివృద్ధి సర్వేపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అధిక శాతం మంది రైతులు కే6 రకం విత్తన వేరుశనగ కావాలని ఎంపీడీఓను కోరారు. స్పందించిన ఎంపీడీఓ రైతులకు కోరిక మేరకు కే6 రకం అందించాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు.

టూరిజం భూముల పరిశీలన

రామగిరి: నసనకోట సమీపంలోని ఏపీ టూరిజం భూములను ధర్మవరం ఆర్డీఓ తిప్పే నాయక్ గురువారం తనిఖీ చేశారు. గ్రామ సరిహద్దుల్లో కాశీవిశ్వేశ్వర ఆలయానికి సంబంధించి సర్వే నంబరు 733–3లో 0.70 ఎకరాలు, తిరుమల దేవర ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 760లో 2.50 ఎకరాలు, దుర్గమ్మ గుడికి సంబధించి సర్వేనంబరు 767లో 2.00 ఎకరాల భూములను గురువారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణస్వామి, ఆర్‌ఐ నరసింహమూర్తి, వీఆర్‌ఓ లోకేష్, సర్వేయర్ నాగకృష్ణ పాల్గొన్నారు.

త్వరలో పాఠ్య పుస్తకాల పంపిణీ



ఎమ్మార్సీలోని పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పూల నరసింహులు

తనకల్లు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు త్వరలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తామని ఎంపీడీఓ పూల నరసింహులు అన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలోని పాఠ్య పుస్తకాలను ఎంఈఓ లలితమ్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పాఠశాలలు తెరిచేలోపు విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలను అందజేస్తామన్నారు. అలాగే మండల వ్యాప్తంగా ఉన్న 82 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 3,991 మంది విద్యార్థులకు అవసరమైన యూనిఫాంను కూడా ఇప్పటికే ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ కంప్యూటర్ ఆపరేటర్ జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీటీ సేవలు మర్చిపోవద్దు



కల్లుబావి తండాలో గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఆర్డీటీ డైరెక్టర్ రాజశేఖరరెడ్డి

గాండ్లపెంట: బడుగు బలహీన వర్గాలకు చేదోడుగా ఉండి వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఆర్డీటీ సంస్థ సేవలను మర్చిపోవద్దని సంస్థ గృహ నిర్మాణ డైరెక్టర్ రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గాజులవారిపల్లి పెద్దతండా పంచాయతీ కల్లుబావి తండాలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పక్కా గృహాలను పరిశీలించారు. గ్రామంలోని ఇళ్లు లేని 21 మంది నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో సంస్థ ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇచ్చేదని.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా లబ్ధిదారులే ఇంటిని నాణ్యతగా నిర్మించుకోవాలన్నదే ఆర్డీటీ ఉద్దేశమన్నారు. గడువులోపు గృహాలను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా బలపడి పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ కృష్ణ పాల్గొన్నారు.

వివిధ కేసుల్లో పట్టుబడ్డ మద్యం ధ్వంసం



కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేసేందుకు కుప్పగా పోసిన దృశ్యం

ఓడీ చెరువు: మండల పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యం, నాటు సారాను గురువారం పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్పీ మాధవరెడ్డి, సెబ్ ఎస్పీ రవికుమార్ ఆదేశాలతో పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన 39 కేసుల్లో పట్టుబడి మద్యాన్ని జేసీబీతో తొక్కించి ధ్వంసం చేసినట్లు సెబ్ ఎస్‌ఐ శ్రీధర్, ఎస్‌ఐ గోపి తెలిపారు. కాగా 39 కేసుల్లో 550 లీటర్ల కర్ణాటక మద్యం, 110 లీటర్ల నాటు సారా పట్టుబడినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కిషోర్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమూల్యం

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

నల్లచెరువు: వలంటీర్లు సంక్షేమ వారధులు అని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గీతామందిరంలో గురువారం ఎంపీపీ రమణారెడ్డి, ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మొత్తం 148 మందిని ఉత్తమ పురస్కారాలకు ఎంపిక చేశారు. ఇందులో ఒక్కరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 142 మందికి సేవామిత్ర పురస్కారాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు–ప్రభుత్వానికి వారధులుగా వలంటీర్లను నియమించడం జరిగిందన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రజల కోసం తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి సైనికుల్లా పని చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు దోచుకో దాచుకో అన్న రీతిలో ప్రతి పనికి ఒక రేటు ప్రకారం తీసుకున్నారన్నారు. అయితే జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పైసా లంచం లేకుండా పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లు పారదర్శకంగా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తెస్తుండటంతో టీడీపీ ఓర్చుకోలేక పోతోందన్నారు. టీడీపీ నాయకులు వలంటీర్ల వ్యవస్థపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.వలంటీర్ల సేవలను గుర్తించి సీఎం వైఎస్ జగన్ వారిని వరుసగా మూడో ఏటా సత్కరించడం గొప్ప విషయమన్నారు. రాబోయే రోజుల్లో వలంటీర్లంతా రెట్టింపు ఉత్సాహంతో ప్రజల కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, మండల స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రామలక్ష్మమ్మ, సర్పంచులు పంచరత్నమ్మ, శ్రీనాథ్‌రెడ్డి, యూసుఫ్, గంగాదేవి, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, సుమియా, నరసింహారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగభూషణ, మండల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ముస్తఫా, డైరెక్టర్ ఆదిమూర్తి, టెంపుల్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, నాయకులు డాక్టర్ శంకర్, బట్టీ హైదర్‌వలి, వై రమణారెడ్డి, మాజీ సర్పంచులు రవికుమార్ రెడ్డి, నరసింహా రెడ్డి, అక్బర్, మాజీ ఎంపీటీసీ రమణ, సానే హరినాథ్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి, పెద్ద మౌలాలి, నజీర్, రఫీ, సూర్యశేఖర్‌రెడ్డి, నాసు నరసింహులు, చిన్నపల్లి హరి,మణి, నాగభూషన యాదవ్, ఆది, టైలర్ రామాంజి, పురుషోత్తం పాల్గొన్నారు.



పురస్కారాలు పొందిన వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

రూ.2.8 కోట్లతో కోనేరు పనులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో రూ.2.8 కోట్లతో చేపట్టిన భృగుతీర్థం (కోనేరు) ఆధునికీకరణ పనులకు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీ నరసింహస్వామి ఆలయ భృగుతీర్థం ఆధునికీకరణ పనులు చేపట్టడం ఎంతో శుభపరిణామన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇది వరకే దాదాపు రూ.2 కోట్లతో కోనేరు పనులు చేపట్టి పూర్తి చేశామని గుర్తు చేశారు. అయితే అకాల వర్షాలతో చేసిన పనులు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. దీంతో కోనేరును భక్తులకు అందుబాటులోకి తీసుకురాలేక పోయామన్నారు. శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం రూ.2.8 కోట్లు వెచ్చించి కోనేరు పనులు చేపట్టామన్నారు. కోనేరును త్వరలోనే పనులు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పనుల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ పట్టం గురుప్రసాద్, పాలక మండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కోనేరు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

ధర్మవరం: పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే తన నివాసంలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన పరిహారం చెక్కులను అందజేశారు. ఐదు కుటుంబాలకు ప్రభుత్వం రూ.5.89 లక్షలు మంజూరు చేసిందన్నారు. వైద్య ఖర్చులకు డబ్బులు చెల్లించి పేదలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఉద్యోగ సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. ఏపీజేఏసీ సత్యసాయి జిల్లా చైర్మన్ మైనుద్దిన్, ప్రధాన కార్యదర్శి పద్మనాభరావు, ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు మధునాయక్, ప్రధాన కార్యదర్శి నరసింహులు, మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహులు, ఏపీఎస్‌ఆర్‌టీసీ ఈయూ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, తహసీల్దార్ యుగేశ్వరి దేవి, ఆర్డీఓ కార్యాలయ అధికారి లక్ష్మీదేవి, హంపయ్య, గోపాల్, మున్సిపల్ అధికారి ఆనంద్‌కుమార్ తదితరులు ఎమ్మెల్యేకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

‘బలవంతంగా టీడీపీ కండువాలు వేశారు’

- పార్టీ మారే ఉద్దేశం మాకు లేదు
- విలేకరులకు తెలిపిన ముదిగుబ్బ వడ్డెర కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

ధర్మవరం: మీతో మాట్లాడాలని టీడీపీ నాయకులు చెబితే పరిటాల శ్రీరామ్ వద్దకు వెళ్లాము.. తీరా అక్కడికి వెళ్లాకు మమ్మల్ని ప్రలోభ పెట్టి బలవంతంగా టీడీపీ కండువాలు వేసి ఫొటోలు తీశారు. అయ్యా మాకు టీడీపీలో చేరే ఉద్దేశం లేదని చెబుతున్నా వినకుండా ఎల్లో మీడియాలో ప్రచారం చేశారని ముదిగుబ్బ వడ్డెర కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పల్లపు రాజు, పల్లపు వెంకటేశ్, అనిల్, గోగుల రాజు, విజయ్, గోగుల పెదన్న, గంగులప్ప, డేరంగుల రాజు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. తుది శ్వాస వరకూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలగా ఉంటామన్నారు. వేరే పార్టీలో చేరే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. పత్రికల్లో తమపై అసత్య కథనాలు రాయవద్దని విజ్ఞప్తి చేశారు.



కండువాలు వేసి, వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఇందుకూరు నారాయణరెడ్డి

డ్రిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

కదిరి అర్బన్: డ్రిప్ కావాలనుకునే రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏపీ మైక్రో ఇరిగేషన్ ఓఎస్‌డీ (టెక్నికల్) వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఆలంపూర్‌లో పద్మావతమ్మ అనే మహిళా రైతు పొలంలో ఏర్పాటు చేసుకున్న డ్రిప్‌ను పరిశీలించారు. డ్రిప్ పని తీరుపై చుట్టుపక్కల ఉన్న రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్ వాడకంపై ఉపయోగాలు, పంటలకు ఫర్టిగేషన్, ఆసిడ్ ట్రీట్‌మెంట్‌పై వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ సుదర్శన్, ఎంఐఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.



ఆలంపూర్‌లో డ్రిప్‌ను పరిశీలిస్తున్న ఏపీ మైక్రో ఇరిగేషన్ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

బత్తలపల్లి: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సంజీవపురం వద్ద ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు చేస్తున్న కూలీలు మస్టర్‌లో నమోదైన వారు ఉన్నారో లేదో పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పనులకు రావాలని సూచించారు.

అనంతరం కూలీతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కూలీ ఒక మీటరు పని చేసినట్లయితే రూ.272 సంపాదించుకోవచ్చన్నారు. ఒక రోజులో కనీసం ఒక మీటరు పని చేసుకోవాలని సూచించారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని త్వరగా పనులకు వచ్చి త్వరగా ముగించుకొని వెళ్లాలన్నారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఓ కుందానం ఆదెప్ప, ఏపీ నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

సమయపాలన తప్పనిసరి

బత్తలపల్లి: సచివాలయ ఉద్యోగులు అందరూ సమయపాలన తప్పక పాటించాలని ఎంపీడీఓ శ్రీదేవి సూచించారు. గురువారం మండలంలోని సంజీవపురం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఉద్యోగులు తమ విధుల్లో భాగంగా ఫీల్డ్‌పైకి వెళ్లినప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అదే విధంగా తమకు సంబంధించిన రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నాడు–నేడు పనులపై ఆరా తీశారు.

పూడికతీతతో భూగర్భ జలాల వృద్ధి

ఓడీ చెరువు: మండలంలోని డబురువారిపల్లి సమీపంలోని చెరువులో అమృత్ సరోవర్ పథకం కింద చేపట్టిన పూడికతీత పనులను గురువారం ఎంపీడీఓ పోలప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమృత్ సరోవర్ పథకం ద్వారా చేపట్టిన పనులను వచ్చే జూన్ మొదటి వారంలో సెంట్రల్ టీం పరిశీలించనున్నట్లు చెప్పారు. చెరువులో పూడికతీత పనుల వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. జాబ్‌కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. వారం వారం చేసిన పనికి పే స్లిప్పులు ఇస్తున్నారా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. పనుల వద్ద కూలీలకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సోముశేఖర్‌రెడ్డి, ఈసీ ఆంజనేయులు, టీఏలు చంద్రారెడ్డి, రాజేంద్ర, రాజారెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



చెరువులో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పోలప్ప

ఎస్సీ వర్గీకరణ చేసే వరకూ పోరాటం

పుట్టపర్తి టౌన్: ఎస్సీ వర్గీకరణ చేసే వరకూ పోరాటం చేస్తూనే ఉంటామని మాదిగల ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు రవిశంకర్ తెలిపారు. గురువారం పట్టణంలోని సాయి ఆరామంలో ఎంఈఎఫ్ తాలూకా అధ్యక్షుడు రాయుడు అధ్యక్షతన ఎమ్‌ఈఎఫ్ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 50 గ్రామాల్లో అనేక కార్యక్రమాల ద్వారా మాదిగలను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలోకి వెళ్లి బలోపేతం చేసేందుకు కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇందులో భాగంగా జూన్ 4న సత్యసాయి జిల్లాలో మాదిగల ఉద్యోగులు మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగల శక్తిని ఐక్యతను చాటడానికి హైదరాబాదులో భారీ బహిరంగ సభను మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ మధుసూదన్, అనంతపురం నగర అధ్యక్షుడు నాగభూషణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవిశంకర్, ఎమ్మార్పీస్ సీనియర్ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, బేకరి గంగాద్రి, ఎస్టీడీ నరసింహులు ఫోటో సాయి, రమణ, నాగభూషణ, నాగానంద, శ్రీనివాసులు, గంగాధర్, శ్యామ్, నరశింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ నాయకులు

జోరుగా సాగుతున్న క్రికెట్ పోటీలు

కనగానపల్లి: మండల కేంద్రంలో శ్రీసత్యసాయి, ఫాదర్ ఫెర్రర్, వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జోరుగా జరుగుతున్నాయి. గురువారం జరిగిన పోటీల్లో కనగానపల్లిపై ముత్తవకుంట్ల, తూంచర్లపై నరసంపల్లి జట్లు విజయం సాధించాయి. ఈ పోటీల్లో మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తరఫున మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బహుమతులు అందించారు.

ముగిసిన బైబిల్ శిక్షణ తరగతులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని వెంగళమ్మ చెరువు హోలిసిటీ చర్చిలో బైబిల్ శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో చర్చిలో బైబిల్ లోని సూక్తులు, బైబిల్ సారాంశాన్ని వివరిస్తూ పాస్టర్ మైకేల్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ హాజరై పలు సూచనలు చేశారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలతో చిన్నారుల్లో విజ్ఞానం పెరుగుతుందన్నారు.

ప్రజల ఆరోగ్యమే మన కర్తవ్యం

తాడిమర్రి: మండలంలోని ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే మన కర్తవ్యమని వైద్యాధికారి డాక్టర్ మహేంద్రనాథ్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్, క్షయ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నారులు, గర్భిణులకు ప్రతి బుధవారం, శనివారాల్లో వేస్తున్న టీకాలను సక్రమంగా వేయాలన్నారు. అలాగే వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు సక్రమంగా నిర్వహిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమలు ప్రభలకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిర్మయి, ఎంపీహెచ్‌ఈఓలు మనోహర్‌బాబు, నారాయణస్వామి, సూపర్‌వైజర్ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

తాడిమర్రి: మండలంలోని నార్శింపల్లి గ్రామంలోని బీసీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను గురువారం అధికారులు పరిష్కరించారు. బీసీ కాలనీలో ఉన్న పంచాయతీ బోరు మోటార్‌కు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడానికి ఓ కుటుంబ సభ్యులు అభ్యంతరం చెప్పారు. దీంతో గ్రామంలోని 150 కుటుంబాలకు తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎంపీడీఓ విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీడీఓ పోలీసుల సహాయంతో మోటార్‌కు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయించడంతో సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కామాక్షి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా వెంగమనాయుడు

ముదిగుబ్బ: జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ముదిగుబ్బకు చెందిన వెంగమనాయుడు ఎంపికయ్యారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ సంపత్ కుమార్ ఆదేశాలతో రాష్ట్ర చైర్మన్ వీవీ రామకృష్ణారెడ్డి తనకు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు వెంగమనాయుడు గురువారం తెలిపారు. ఎన్నికకు కృషి చేసిన జనరల్ సెక్రటరీ స్వప్న, రాష్ట్ర చైర్మన్ రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు.

నేడు ‘వలంటీర్లకు వందనం’

గాండ్లపెంట: స్థానిక ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జిల్లా, మండల కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, డైరెక్టర్‌లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు కదిరిలో..

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని మైనార్టీ షాదీమహాల్‌లో ఈనెల 27న ఉదయం 9 గంటలకు కదిరి మండలానికి సంబంధించిన వలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అంజనప్ప గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి

నల్లచెరువు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏఓ భారతి, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ముస్తఫా ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ఆవుటాల రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాలయలను అందిస్తుందని తెలిపారు. ఈనెల 30వ తేదీన రైతు భరోసా సంబంధించిన నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ప్రతి రైతు తన పొలంలో భూసార పరీక్షలు చేయించాలన్నారు. పంటకు సంబంధించిన ఎరువులు, పురుగు మందులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు విధిగా తాము సాగు చేసిన పంటలను రిజిస్ట్రేషన్ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ కమిటీ మెంబర్ సుధీర్, మండల అగ్రి అడ్వైజరీ కమిటీ మెంబర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ రవిరుమార్ రెడ్డి, పెద్ద మౌలాలి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ గాయత్రి

కొత్తచెరువు: రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దేశంలో ఏ ముఖ్యమంత్రి సాటిరారని ఎంపీపీ గాయత్రి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జగనన్న విద్యా దీవెన పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని జమ చేసిన విషయం తెలిసిందే. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. నిరుపేద విద్యార్థులు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నత చదువులు చదవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి కళాశాలల యాజమాన్యాలకు కాకుండా నేరుగా తల్లుల ఖాతాల్లోకి మొత్తాలను జమ చేయడం హర్షణీయమన్నారు. అలాగే వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్లు, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, తదితర పథకాలను కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి

పుట్టపర్తి అర్బన్: మండలంలోని గంగిరెడ్డి పల్లి చెరువు కట్టపై వెలసిన ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గంగాద్రి దంపతులు గురువారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.50,116 విరాళంగా అందజేశారు. జూన్ నెలలో ఆలయ ప్రారంభోత్సవం ఉంటుందని, అత్యంత వైభవంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక రెండు రాష్ట్రాల్లో ఆంజనేయ స్వామికి భక్తులు ఉన్నారు.